క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన తోట రాంజీ



తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన తోట శ్రీరాంజీ

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, జగ్గంపేట నియోజకవర్గ యువనేత, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ మంగళవారం తాడేపల్లి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తనని రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నియిమించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అప్పగించిన భాధ్యతలను చిత్త శుద్ధితో నిర్వహించి జిల్లాలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపినట్లు రాంజీ జగ్గంపేటలో మీడియాకు వెల్లడించారు.

డయేరియా రోగులకు ఎమ్మెల్యే పరామర్శ

రౌతులపూడి: ఇటీవల డయేరియాతో బాధపడుతూ రౌతులపూడి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న దబ్బాది, సత్యవరం గ్రామాలకు చెందిన రోగులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మంగళవారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యంపై సీహెచ్‌సీ వైద్యులు జానకీదేవి, పావనిని ఆరాతీశారు. తొందరగా కోలుకునేందుకు అవసరమైన మెరుగైన చికిత్స అందించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా రోగులను పరామర్శించి పళ్లు,రొట్టెలు పంపిణీ చేశారు.

సత్యదేవుని సన్నిధిలో కలెక్టర్ దంపతులు



సత్యదేవుని ఆలయంలో కలెక్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయాన్ని మంగళవారం కలెక్టర్ షాన్‌మోహన్ దంపతులు దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేయగా ఈఓ వీర్ల సుబ్బారావు స్వామివారి ప్రసాదాలు అందచేశారు. దేవస్థానంలో భక్తుల సౌకర్యాల గురించి ఆయన ఈఓను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఏఈఓ కృష్ణారావు, విశ్రాంత ఆర్‌ఐ ప్రసాద్ తదితరులున్నారు.

ఏలేరులో తగ్గుతున్న నీటినిల్వలు



ఏలేరు జలాశయంలో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: మే నేల నుంచే వర్షాలు పడుతున్న ఆశించిన స్థాయిలో ఏలేరుకు వరద ప్రవాహం రాకపోవడంతో జలాశయంలో నీటినిల్వలు స్వల్పంగా తగ్గుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటిసరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో ప్రస్తుతం నీటినిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. దిగువప్రాంతంలో సాగులేకపోవడంతో ఆయకట్టుకు నీటి సరాఫరా నిలిపివేశారు. దీంతో మంగళవారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 76.51 మీటర్లు, 24.11 టీఎంసీలకు 9.71 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి విశాఖకు 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి సరాఫరా నిలిపివేశామని ప్రాజెక్ట్ అధికారులు వెల్లడించారు.

సందడి చేసిన సినీ హీరో

ప్రత్తిపాడు: జగన్నాథ్ చలన చిత్రం వచ్చే నెలలోనే విడుదలకు సిద్ధమవుతుందని ఆ చిత్రంలోని కథానాయకుడిగా నటించిన రాయలసీమ భరత్ తెలిపారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ నుంచి అరకు వెళ్తూ ప్రత్తిపాడులో ఆగి సందడి చేశారు. స్థానికంగా పరిచయస్తుడైన కింగుబాబు రాజా స్వగృహానికి ఆయన విచ్చేశారు. కొంతసేపు వారితో ముచ్చటించారు. ఒకరినొకరు యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆయనను బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను,తదితరులు కలిశారు.

బంకులో విజిలెన్స్ తనిఖీలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలోని పెట్రోల్ బంకులో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ తాతారావు సారధ్యంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. పెంట్రోల్ బంకు ఆవరణలో పచ్చదనం లేకపోవడాన్ని, వాస్ రూం అపరిశుభ్రంగా ఉండటాన్ని, అనుమతి లేకుండా ఉన్న రెండు వాహనాలు పెట్రోల్ బంకు ఆవరణలో ఉండటాన్ని అధికారులు గుర్తించి హెచ్చరించారు.

మస్తర్లలో నిలువు దోపిడీ

- ఉపాధి హామీలో భారీ అవినీతి
- కూలీల సొమ్ము స్వాహా చేస్తున్న నేతలు
- మస్తర్ల పేరుతో రూ.లక్షలు మళ్లింపు



సి.రాయవరంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు

ఏలేశ్వరం: కూలీనాలీ చేసుకొనే పేదప్రజల కోసం కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామి పథకం కూటమి నేతలకు మహాప్రసాదంగా మారింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామి పథకంలో కూటమి నేతలు దొరికిన కాడికి దోపిడీ చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ అనుయాయులకు జాబ్‌కార్డులు ఇప్పించి పనికి వెళ్లకుండా వేతనాలు సొమ్ము డ్రా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి నేతలకు నిరుద్యోగ సమస్య లేకుండా ఉపాధిహామి పథకం ఉపయోగపడుతుందని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

దొంగ మస్తర్‌లు, బోగస్ పనులు

మండల వ్యాప్తంగా 11,100 జాబ్‌కార్డులు ఉన్నాయి. వాటిలో వ్యవసాయానికి 8,242, హౌసింగ్ 908, మిగిలినవి తదితర పనులకు సంబంధించి జాబ్‌కార్డులు జారీ చేశారు. ప్రతికూలీకి ఏడాదిలో కనీసం వందరోజుల పనికల్పించాలనే లక్ష్యంతో రోజుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ మేరకు రోజుకు రూ.307 వరకు సొమ్ము డ్రా చేసుకోవచ్చు. దీనిలోనే తిరాకాసు అంతా ఉంది. వాస్తవంగా కూలీపనులు చేసే వారికి జాబ్‌కార్డులు జారీ చేస్తారు. కాని మండలంలో కూటమి నాయకులు తమకు నచ్చిన వారికి జాబ్‌కార్డులు ఇచ్చి తప్పుడు మత్తర్‌లు నమోదు చేసి వేతనాలు వసూలు చేస్తున్నారు. నిజంగా కూలీ పనిచేస్తున్న వారికి రోజుకు రూ.150 మించి రాకపోయినా నేతల అనుయాయులు పూర్తిస్థాయిలో కూలీ సొమ్ము డ్రా చేస్తున్నారని సమాచారం.

కుమ్మక్కైన అధికారులు, సిబ్బంది

మండలస్థాయి అధికారులు, నాయకుల ఒత్తిడితో పనికి వెళ్లని వారికి సైతం ఉపాధి సొమ్ము జమా చేస్తున్నారు. గ్రామాల్లో రోజుకు సుమారు 50 మంది పనికి వెళితే వందమందికి పైగా మస్తర్‌లు వేస్తున్నారు. ఉదాహరణకు పనిలో దగ్గర ఉన్న ఫీల్డ్‌అసిస్టెంట్ వచ్చిన కూలీల కంటే స్థానిక నాయకుల ఒత్తిడితో అదనంగా మరో సంఖ్య వేసి కార్యాలయానికి పంపిస్తున్నారు. కార్యాలయంలో నాయకులు కంప్యూటర్ ఆపరేటర్‌పై ఒత్తిడి తెచ్చి జాబితాలో అదనంగా మరికొందరి పేర్లు చేరుస్తున్నారు. ఇలా నెలకు లక్షల్లో ఉపాధి సొమ్మునూ దోచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధిహామి మండల అధికారి ఈ మోసాల్లో కీలకంగా వ్యవహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

ఉపాధిహామి పథకంలో లక్షలాది రూపాయిలు సొమ్ము దోపిడికి గురవుతున్నా సంబంధిత ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి గ్రామస్థాయి నాయకులు, మండలస్థాయి నాయకులు, అధికారులకు ఉపాధి సొమ్ము ప్యాకెట్ మనీలా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుద్యోగ సమస్య తీరుస్తానని హామి ఇస్తే ఉపాధిహామి పథకంతో తమ కూటమి నాయకులకు ఉద్యోగాలు ఇస్తాడని అనుకోలేదని సామాన్యులు నోరు వెళ్లబెడుతున్నారు.

పారదర్శకంగా మస్తర్లు వేయాలి



ఉపాధిపనులకు వెళ్లిన వారికే మస్తర్లు వేయాలి. మస్తర్‌లు వేయడంలో పారదర్శకంగా వ్యవహరించాలి. అసలైన కూలీలకు పూర్తిస్థాయిలో ఉపాధి సొమ్ము అందేలా అధికారులు చూడాలి.

– గుమ్ములూరి వెంకటరమణ, సి.రాయవరం

ఎటువంటి అవకతవలు లేవు

ఉపాధి పనుల్లో ఎటువంటి అవకతవకలు లేవు. నిబంధనల మేరకు మస్తర్‌లు వేస్తున్నాం. ఎటువంటి మోసాలకు అస్కారం లేదు.

– సత్యనారాయణ, ఏపీఓ ఏలేశ్వరం మండలం

సంక్షేమం లేని అసత్యాల కూటమి



ప్రత్తిపాడులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు: కల్లబొల్లి కబుర్లతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి, అవాస్తవాలతో కాలయాపన చేస్తుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ ధ్వజమెత్తారు. 'జగన్ అంటే నమ్మకం... బాబు అంటే మోసం' పేరుతో పుస్తకాన్ని స్థానిక లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిశెట్టి బులిరామకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హాయాంలో విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా నేటికీ రైతులకు రుణాలు లేవని, విత్తనాలను అందించడలేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ హాయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తే, కూటమి ఏడాది పాలన గడుస్తున్నా ఎన్నికల హామీ ఊసే లేదని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి వ్యత్సాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కూడా ఈ విషయాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని రామిశెట్టి బులిరామకృష్ణ కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, దోచిట్టిబాబు, గోళ్ల జయశేఖర్, దేవ లక్ష్మణ్, లొండ బాబు, జువ్వల చినబాబు, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, ఏడిద రెడ్డినాయుడు, పినిశెట్టి ప్రకాష్, కొట్టేటి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన



జగ్గంపేటలో పుస్తకాన్ని ఆవిష్కరించిన మండల నేతలు

జగ్గంపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంటే నిర్వచనం అశాంతి, అరాచకం, ఆటవిక పాలనగా కొనసాగుతోందని, జగ్గంపేట మండల వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. మంగళవారం బాలాజీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం , బాబు అంటే మోసం పేరుతో పుస్తకాన్ని మండల నేతలు ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి కూటమి అధికారంలోకి వచ్చి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో లాండ్ ఆర్డర్ క్షీణించిందని, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు,పెరిగిపోయాయని విమర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ ఈ పుస్తకంలో అనేక విషయాలు ఉన్నాయని వాటిని నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వరుపుల సూరిబాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కరుటూరి వీర్రాజు, గ్రామిక విభాగం అధ్యక్షుడు గుర్రం మహాలక్ష్మి, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు గిడియాల పెదకాపు, యువజన విభాగం నేత నకిరెడ్డి ఆదివిష్ణు చక్రవర్తి, టౌన్ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, మహిళా నాయకురాలు గండికోట అరుణ, కూనిశెట్టి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రోగులకు ముద్రగడ పరామర్శ



రౌతులపూడి సీహెచ్‌సీలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: డయేరియాకు గురై రౌతులపూడి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం డయేరియా ప్రబలిన సబ్‌ప్లాన్ ప్రాంతానికి చెందిన దబ్బాది, సార్లంక, సత్యవరం గ్రామాల్లోని పరిస్థితి గురించి ఆయన ఆరా తీశారు. పూర్తిగా కోలుకునే వరకు వైద్య చికిత్స పొందాలని బాధితులకు సూచించారు. ఆరోగ్య పరిస్థితులు గురించి వైద్యులను అడిగి రోగులందరికీ మెరుగైన వైద్యాన్ని అందివ్వాలని వైద్యులకు సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలతో, మందులు కొరత లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎంఅండ్ హెచ్‌వోతో నరశింహనాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్యను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, నాయకులు వాసిరెడ్డి జమీలు, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎస్టీ విభాగం అధ్యక్షుడు చెన్నాడ సత్తిబాబు, భీమరాజు, దేముడు, ఎంపీటీసీ సభ్యురాలు నూకరత్నం, పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పైడిమల్లమ్మను దర్శించిన ముద్రగడ

రౌతులపూడి: మండలంలోని మల్లంపేటలో గ్రామంలో ఇలవేల్పుగా కొలుచుకునే పైడిమల్లమ్మ తల్లిని మంగళవారం ప్రతిపాడు వైఎస్సార్ సీపీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు దర్శించుకున్నారు. గ్రామస్తులు పిలుపు మేరకు పైడిమల్లమ్మతల్లి జాతరను తిలకించేందుకు గ్రామానికి వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులతో కలసి దర్శించుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు గురించి ఆరాతీసి సంతోషం వ్యక్తం చేశారు. అమ్మవారు ప్రజలందరికీ చల్లని దీవెనలందివ్వాలని ఆయన ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, నాయకులు వాసిరెడ్డి జమీలు, పార్టీ కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యన్నారాయణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి తిరుమలరాయల్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

తూకంతోనే సరఫరా చేయాలి



కోటనందూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రేషన్ డీలర్లు

కోటనందూరు: ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్‌డిపోలకు సరఫరా చేసే బియ్యాన్ని తూకం వేసి రేషన్‌డీలరుకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మండల రేషన్‌డీలర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీవీవీ సత్యన్నరాయణకు డీలర్ల సంఘ అధ్యక్షుడు దారకొండ జోగిరాజు ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. రేఖవానిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్‌షాపులకు సరఫరా చేసే బియ్యాన్ని తూకం వేసేందుకు 3.5 టన్నుల స్థాయి కాటాను ఏర్పాటు చేశారని, అయితే గోదాము ఇన్‌చార్జ్‌లు, హమాలీలు ఉద్దేశ్య పూర్వకంగానే కాటాను వినియోగించడం లేదని ఆరోపించారు. జూన్ నెలకు సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డీలరుకు స్టేజ్–2 కాంట్రాక్టరు ద్వారా తూకం వేయకుండా బస్తాల రూపంలో సరఫరా చేసారన్నారు. ఈ కారణం తో ప్రతీ డీలర్ 80 కేజీల నుంచి 150 కేజీల వరకూ నష్టపోయామని తహసీల్దార్‌కు వివరించారు. జులై నెలలో ఇచ్చే రేషన్‌బియ్యాన్ని 3.5 టన్నుల కాటాపై తూకం వేసి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తూకం వేయకుండా సరుకులు సరఫరా చేస్తే తీసుకోమని వెల్లడించారు.

పీహెచ్‌సీలో కలెక్టర్ తనిఖీలు



గోకవరం ప్రభుత్వాస్పత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం: గోకవరం ప్రభుత్వాస్పత్రిని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో మౌలిక వసతులు, వైద్య పరికరాలు, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వాటికి సంబంధించిన రికార్డులు నిర్వహణ, ఆక్సిజన్ సరఫరా, వెంటిలేటర్‌ల పనితీరు తదితర విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి విభాగాన్ని పరిశీలించి గర్భిణులకు అందుతున్న వైద్య సేవల గూర్చి ఆరాతీశారు. సాధారణ ప్రసవాలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. సిబ్బంది కొరత విషయమై జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రాయవరపు శ్రీనివాస్‌రావులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట డీసీహెచ్ఎస్ పద్మావతి తదితరులు ఉన్నారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలి



అటికెవానిపాలెం పొలంబడిలో సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అశోక్ కుమార్

తుని రూరల్: వాతావరణ పరిస్థితులకు అనువుగా ఖరీఫ్ పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధం కావాలని ఏఓ బి.అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం తుని మండలం అటికెవానిపాలెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సాగునీరు లభించే మాగాణిలో వరిపైర్ల నారుమడులు సిద్ధం చేసుకొవాలని మెట్ట భూముల్లో ఆరుతడిగా సాగయ్యే పత్తి, ఇతర పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కౌలుదారులు దరఖాస్తులు చేసుకుంటే సీసీఆర్‌సీ కార్డులు జారీ చేస్తామన్నారు. అవసరమైన వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. అధికారుల సూచనలతోనే పురుగు మందులు వాడాలని, లేదంటే తీవ్రంగా నష్టపోవలసి వస్తుందని హెచ్చరించారు. వాణిజ్య పంటలను సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలన్నారు. ఆత్మ బీటీఎం ఎన్.బాబురావు, ఏఈఓ దైవప్రసాద్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి



గోకవరంలో పుస్తకావిష్కరణ చేస్తున్న పార్టీ నాయకులు

గోకవరం: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే రాష్ట్ర ప్రజలకు ఓ నమ్మకమని, ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే మోసం అని ప్రజలు విశ్వసిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు అన్నారు. గోకవరంలో సొసైటీ మాజీ చైర్మన్ దాసరి చినబాబు ఇంటి వద్ద పాటి రాంబాబు అధ్యక్షతన జగన్ అంటే నమ్మకం–బాబు అంటే మోసం పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపొందడమే లక్ష్యంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, లీగల్ అడ్వైజర్ గుల్లా ఏడుకొండలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నలుగురి సారా విక్రేతల అరెస్టు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 45 లీటర్ల సారాతో నలుగురు నిందితులను అరెస్టు చేసి, 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. స్థానిక ఎక్సైజ్ సీఐ శివ ప్రసాద్ కథనం మేరకు ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామంలో ధారా లోవరాజును, కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో పొన్నం మణికంఠస్వామిని, ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో టేకుమూరి కృపావతిని అదుపులోకి తీసుకుని, ఒక్కొక్కరి వద్ద నుంచి ఐదేసి లీటర్ల వంతున 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఏలేశ్వరం మండలం అప్పనపాలెం గ్రామంలో 20 లీటర్ల సారాతో మొువ్వాడ మంగను అరెస్టు చేశారు.విక్రేతలకు సారా అందించిన రామిశెట్టి శ్రీను, సుంకర చిన వీరబాబులపై పరారీ కేసులు నమోదు చేశారు. అప్పనపాలెం గ్రామంలోని సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 1,000 లీటర్ల బెల్లపు ఊటను, పెద్దిపాలెం గ్రామంలో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

సారా తయారీదారుడు బొందలపు రమణపై పరారీ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ జీవీ లక్ష్మి, కాకినాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కేవీ స్వామి, ఎస్సై విజయలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

ముగిసిన ఎన్‌సీసీ సెలక్షన్ క్యాంపు



సెలెక్షన్ క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఈ నెల 8 నుంచి మంగళవారం వరకు జరిగిన 6ఏ నావెల్ ఎన్‌సీసీ సెలక్షన్ క్యాంపు విజయవంతంగా ముగిసినట్టు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ ఎం. శ్రీనివాస రెడ్డి మంగళవారం తెలిపారు. శిక్షణకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కి యూనివర్సిటీలో అతిథి సౌకార్యలు కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ అజయ్ యాదవ్, స్టాఫ్ గోవిందరావు, తదితరులు ఆదిత్య యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ముదునూరి



తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ముదునూరి కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి నివాసంలో ఆ పార్టీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసాపురం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు.

అధ్యాపకుల ఆర్థిక చేయూత



కృష్ణ కుటుబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న అధ్యాపకులు

గండేపల్లి: తోటి అధ్యాపకుడు మరణిస్తే బాధిత కుటుంబానికి అధ్యాపకుల సంఘం ఆర్థిక సహాయం అందజేసిన వైనమిది. మండలంలోని నీలాద్రిరావుపేట సర్పంచ్, వైఎస్సార్ సీపీ గ్రామ నేత ములంపాక సురేష్ సోదరుడు (కృష్ణ) ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందిన విషయం పాఠకులకు విధితమే. మృతుడు మారేడుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పౌరశాస్త్రం (సివిక్స్) అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. కృష్ణ కుటుంబాన్ని ఆర్థికంగా సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో మంగళవారం ఆంధ్రప్రదేశ్ పౌరశాస్త్ర అధ్యాపకుల సంఘం రూ.1,30,500 ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేసి ప్రగాడ సానుభూతిని తెలిపారు. అన్ని విధాల అండగా ఉంటామని కుటుంబానికి భరోసా నింపారు.

ఏఎంసీ కార్యవర్గానికి అభినందనలు

గండేపల్లి: ఏఎంసీ (మార్కెట్ కమిటీ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ మేరకు మంగళవారం నూతన కార్యవర్గానికి పలువురు రాజకీయ నాయకులు, రైతులు, తదితరులు అభినందనలు తెలియజేశారు. రైతాంగాన్ని ఏఎంసీ ద్వారా అన్ని విధాల సహకరిస్తూ అభివృద్ధి పదంలో నడిపించాలని వారు కోరారు.

వ్యవసాయాధికారిగా సుధామాధురి



కిర్లంపూడి వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న సుధామాధురి

కిర్లంపూడి: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓగా నాగం సుధామాధురి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కిర్లంపూడి ఎంఏఓగా విధులు నిర్వహిస్తున్న జోకా అమృత ప్రత్తిపాడు వ్యవసాయ శాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సామర్లకోట వ్యవసాయ శాఖ భూసార పరీక్ష కేంద్రంలో ఏఓగా పనిచేస్తున్న సుధామాధురి కిర్లంపూడి మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు సలహాలు ఇచ్చేందుకు తన సిబ్బందితో ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే విత్తనాలు, ఎరువులతో పాటు ప్రభుత్వ సంభందిత పథకాలు రైతులకు సకాలంలో అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం

తొండంగి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీవో రాజేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దడాల సువర్ణలత అధ్యక్షతన గురువారం ఉదయం 10: 30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలు, చేపట్టవలసిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించనున్నారన్నారు. కావున ఈ సమావేశానికి ఎంపీటీసీలు, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన బాలిక

గండేపల్లి: అదృశ్యమైన బాలికను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం గండేపల్లి గ్రామానికి చెందిన పద్నాలుగు సంవత్సరాల బాలిక కనిపించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి 11.గంటలకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసి 24 గంటల గడవకముందే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి, వేగవంతంగా విచారణ జరిపి బాలిక సమాచారాన్ని కనుగొని మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయం వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పలువురు పోలీసు సిబ్బందిని అభినందిస్తున్నారు.